# బొమ్మా బొరుసూ

"మీకేదో ఉత్తరం వచ్చిందండీ !" ఆఫీసునుండి రాగానే కాఫీ కప్పుతో పాటు ఒక కవరు కూడా అందించింది విమల

కప్పు పక్కన పెట్టి ఉత్తరం తీశాను

ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరి 'అయ్యాను.

ఆ కాగితం పై రెండే వాక్యాలున్నాయి.

"సౌందర్యం జ్వాలవంటిది అది దూరం నుండి అందంగానే ఉంటుంది. కానీదగ్గరికెడితే నిలువునా దహిస్తుంది - చైతన్య !"

ఆ మాటల కర్థం నాకు చప్పున తెలియలేదు. కానీ, మళ్ళీ మళ్ళీ చదువుతుంటే.... ఆ వాక్యాల్లో ఏదో అపశ్రుతి వినబడుతోంది.

చైతన్య ఎందుకిలా రాశాడు. ఏ సౌందర్యజ్వాల అతణ్ణి కబళించి ఉంటుంది? ఆ వ్యక్తి ఎవరు?

నా దృష్టి ఎదురుగా ఉన్న గోడమీద పడింది.

అక్కడ చైతన్య ఛాయాచిత్రం ఉంది !

చైతన్య గొప్ప చిత్రకారుడు. తన చిత్రాన్ని తనే గీసుకున్నాడు. ఆ చిత్రంలో చైతన్య అందంగా నవ్వుతున్నాడు. వాడి నవ్వులో మెరుపులున్నాయి. కళ్ళల్లో అంతులేని తృష్ణ ఉంది. ఆ చిత్రం కింద వాడు రాసిన మాటలూ స్పష్టంగా కనబడుతున్నాయి.,

'సౌందర్యాన్వేషణే మానవుని ధర్మం

సౌందర్యారాధనే మానవుని కర్మ'

చైతన్య అంతటి సౌదర్య పిపాసి కాబట్టే అందర్నీ ఆనందపెట్టే చిత్రకారుడు కాగలిగాడు.

ఎన్నో సన్మానాలూ, బిరుదులూ పొందాడు. ప్రతి కళాకారుడూ అసూయపడే జీవితం వాడిది. ఎప్పుడూ నవ్వుతూ - ఆనందానికి ప్రతీకగా ఉండే చైతన్య కిప్పుడు ఏం జరిగింది ?

వాడెప్పుడూ అంతే !

ఏదీ సూటిగా చెప్పడు. వాడి మాటల్లోంచి భావాన్ని వెతుక్కోవడం చాలా కష్టమైన పని. 'వాడు కవి అయితే చాలా బాగుండేది' అని అనుకునేవాడిని.

చైతన్యా, నేనూ కలిసి డిగ్రీ చదివాం. ఆమూడేళ్ళూ ఒకే ప్రాణంగా మెలిగాం. మా స్నేహం ఎందరికో అసూయను కూడా కలిగించింది.

డిగ్రీ పూర్తయ్యాక మా దారులు వేరయ్యాయి! నేను నాలుగుత్తరాలు రాస్తే వాడొక్కటి రాసేవాడు. అయినా నేను కోపగించుకోలేదు. వాడికి తీరిక తక్కువని సరిపెట్టుకున్నాను.

దాదాపు ఆరు నెలల తర్వాత వాడి దగ్గర నుండి వచ్చిన ఉత్తరమిది. ఎంతైనా వాడు నా ప్రాణ స్నేహితుడు. వాడి కష్టాన్ని తెలుసుకొనడం నా బాధ్యత అనుకుంటూ లేచాను. ఫోను చేసి రాత్రి ట్రెయిన్‌కి టికెట్ రిజర్వ్ చేయించుకున్నాను. నా అసిస్టెంటుకు ఫోను చేసి నేను వచ్చేవరకూ నా వర్కు చూడమని చెప్పాను.

ఫోను పెట్టేస్తుండగా విమల వచ్చింది.

"శెలవంటున్నారూ, ఎక్కడికి వెడుతున్నారు" అనడిగింది!

"రాత్రి ట్రెయిన్‌కి మద్రాసు వెడుతున్నాను."

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగింది. టేబిల్ మీదున్న ఉత్తరం ఆమె కిచ్చాను.

అది చదివి మరింత ఆశ్యర్యపడింది.

"ఏమిటీ ఉత్తరాని కర్థం ?"

"నాకూ సరిగ్గా తెలీదు. నా ఫ్రెండు చైతన్య రాశాడు."

"అంటే మన మేరేజ్‌కి రాధాకృష్ణ పెయింటింగ్ ప్రజెంట్ చేశాడు- ఆయనేనా?"

"అవును. బాగా జ్ఞాపకం ఉంచుకున్నావే?"

"ఈ ఉత్తరానికి అర్థం...?

"అది తెలుసుకోవాలనే వాడి దగ్గరకు వెడుతున్నా !"

"చైతన్య అందమైన పేరు ? ఆయనెలా ఉంటారు?" కుతూహలంగా అడిగింది.

"చూడగానే స్ఫురద్రూపి అనిపించడు. కానీ వాడి కళ్ళల్లోని మెరుపు, అందమైన పెదవుల వంపు, చక్కని మాట తీరు... ఎవరినైనా ముగ్ధులను చేస్తుంది. అంతేకాదు. ప్రపంచంలోని అందాల్ని చూసి స్పందించే మనస్సు ఉంది."

"ఆయన వేసిన చిత్రాలేమీ నేను చూడలేదండీ !"

"వాడి చిత్రాలు ఎన్నో బహుమతులు పొందాయి."

"అలాగా...?"

"విమలా ! వాడి భార్య చాలా అందంగా ఉంటుంది. పేరు నీహారిక."

విమల నవ్వింది.

"సౌందర్యారాధకుడికి తగిన భార్య దొరికిందన్నమాట!"

"వాళ్లిద్దరి అన్యోన్యం చూస్తే మరింత ఆశ్చర్యపోతావ్ ! చైతన్యకి ఆమె అంటే పంచ ప్రాణాలు."

"మీకంటే నయమేనన్నమాట!" కొంటెగా నవ్వింది.

మరొకప్పుడైతే ఆ మాటకి సరైన జవాబు చెప్పి ఉండేవాడిని. కానీ ఇవాళ చైతన్య గురించిన ఆలోచనలతో మనసంతా చికాగ్గా ఉంది. ఎప్పుడెప్పుడు వాణ్ణి చూద్దామా అని ఆరాటపడసాగాను.

"నేనూ రానా?" విమల అడిగింది.

"వద్దు ! నాకిక్కడ ఆఫీసులో ఎంతో పనుంది. ఒక్కరోజుండి వచ్చేస్తాను."

"సరే!"

నేను సూట్‌కేస్ సర్దుకోడానికి గదిలోకి వెళ్ళాను.

* * *

నేను వెళ్ళేసరికి చైతన్య విషాదయోగంలో ఉన్నాడు. గడ్డం, మీసాలూ పెంచి, మంచంమీద పడుకుని సీలింగ్ వేపు చూస్తున్నాడు.

నా అడుగుల చప్పుడు విని తల కూడా తిప్పలేదు. 'ఏదో పెద్ద కష్టమే వచ్చింది' అనుకున్నాను.

దగ్గరికి వెళ్లి "చైతన్యా!" అని పిలిచాను.

అప్పుడు తల తిప్పాడు.

వాడి కళ్ళు ఎప్పట్లా మెరవడం లేదు. జీవంలేని గాజు కళ్ళలా ఉన్నాయి. పెదవులు నల్లగా కమిలిపోయి ఉన్నాయి.

నేను మంచం పక్కనున్న కుర్చీని దగ్గరగా జరుపుకుని కూర్చున్నాను.

"వచ్చావా గోపాలం!" నాచేతిని పట్టుకుని ఆనందంగా అన్నాడు.

"నువ్వేమిట్రా ఇలా అయిపోయావ్? "అన్నాను. ఆమాటతో వాడు యథాస్థితికి వచ్చాడు.

ఆ నిశ్శబ్దం భరించలేకపోయాను.

"నీరూ ఏదిరా?" అనడిగాను చుట్టూ చూస్తూ.

"లేదు. పుట్టింటికి వెళ్ళింది."

నేను ఆశ్చర్యపోయాను.

"నిన్నీ స్థితిలో వదిలి వెళ్ళిపోయిందా?

"నేను పంపించేశాను."

ఆ మాట మరీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

నీహారికను చూడకుండా క్షణం కూడా ఉండలేడు చైతన్య. పెళ్ళైన రెండేళ్ళలో ఆమె ఒక్కసారి కూడా పుట్టింటికి వెళ్ళలేదు...అటువంటి వ్యక్తి నీహారికను స్వయంగా పుట్టింటికి పంపడమా? అందులోనూ ఈ పరిస్థితిలో...

"అసలేం జరిగిందిరా?" అనడిగాను.

"చెప్తారా ! నా మనస్సు అర్థం చేసుకుంది నువ్వొక్కడివే ! నా మనస్సులోని భారాన్నంతా నీ ముందుంచాలనే నీకు ఉత్తరం రాశాను. నువ్వు పరుగెట్టుకుంటూ వచ్చావ్. గోపాలం ! నువ్వు నా నిజమైన స్నేహితుడివి." స్నేహమే గొప్ప సంపదయితే నేను చాలా ధనవంతుడిని. నా చేతిని పట్టుకున్నాడు. వాడి కళ్ళల్లోంచి నీళ్ళు జారి నా చేతులమీద పడ్డాయి.

నేను చలించిపోయాను. వాడికి ఏడుపన్నా, ఏడ్చేవాళ్ళన్నా అసహ్యం!

"ఒరేయ్ గోపాలం ! నవ్వు మానవుడికి దేవుడిచ్చిన వరం. ఈ సృష్టిలో నవ్వే జీవి మానవుడొక్కడే. కాబట్టి ఆ వరాన్ని సార్థకం చేసుకోవాలిరా" అనేవాడు.

అటువంటి వ్యక్తికళ్ళల్లో నీళ్ళు....

"చైతన్యా ! ప్లీజ్! ఏం జరిగిందో చెప్పరా! ఈ సస్పెన్స్ భరించ లేకుండా ఉన్నాను." అన్నాను.

"చెప్తారా! నువ్వు రాత్రల్లా ప్రయాణంచేసి ఉన్నావు. స్నానం చేసిరా. ఈలోపు పనిపిల్ల కాఫీ,టిఫిను సిద్ధం చేస్తుంది....వెళ్ళు."

నాకూ బడలికగానే ఉంది. వెంటనే లేచాను.

* * *

"గోపాలం! మాది అందమైన పల్లెటూరు. ఓ పక్క కొండలు.... మరో పక్క తోటలు..... పొలాలు. ఓహ్! ఆ ఊరి అందం మాటల్లో చెప్పలేను!"

నేనా ఊళ్ళో పుట్టడంవల్లనే చిత్రకారుడిని కాగలిగానని నా నమ్మకం" అంటూ చెప్పడం మొదలెట్టాడు చైతన్య.

వాడి జీవిత చరిత్ర వినాలని నాకూ కుతూహలంగానే ఉంది.

"గోపాలం! మా ఇల్లు ఆ ఊరి మధ్యలో ఉండేది. పెద్ద మండువాలోగిలి. చుట్టూ పెద్దపెద్ద చెట్లు. మండువేసవిలో ఊటీలా ఉండేది. స్కూలులేని రోజుల్లో చెట్ల వెంటా,పొలాల వెంటా తిరుగుతూ ఎంతో హాయిగా గడిపేవాణ్ణి. హైస్కూలు చదువయ్యాక కాలేజీలో చేరాను. రెండుమూడు రోజులు సెలవులొచ్చినా ఇంటికి పరుగెట్టేవాణ్ణి. నీకది తెలుసుకదా!

ఒకసారి నేను ఇంటికి వెళ్ళేసరికి వంటింట్లో అమ్మ పక్కన ఎవరో అమ్మాయి కనబడింది.

తెల్లగా, బొద్దుగా, అందంగా ఉంది. గుండ్రటి ముఖం. నీళ్ళలో చేపల్లాకదలాడే కళ్ళు- శాపగ్రస్తురాలైన దేవకన్యలా ఉంది. ఆ అమ్మాయి తన పెద్ద కళ్లను మరింత పెద్దవి చేసి నన్ను చూడసాగింది

అమ్మ పరిచయం చేసింది. "కరణంగారి మేనకోడలు.... పేరుపూర్ణ......"

నేను పలకరింపుగా నవ్వేసి నాగదిలోకి వచ్చేశాను. నేను సెలవులకు ఇంటి కెళ్లినప్పుడల్లా ఆ అమ్మాయి కనబడేది. నన్ను చూసి బెదిరే లేడిలా పారిపోయేది.

నాకూ నవ్వు వచ్చేది. ఒక రోజు సాయంత్రం వేళ కాలవ ఒడ్డుకి షికారు కెడితే పూర్ణ కనబడింది. అస్తమిస్తున్న సూర్యుణ్ణి చూస్తూ ఒంటరిగా కూర్చుంది. దగ్గరగా వెళ్ళి -

"పూర్ణా!" అని పిలిచాను. పూర్ణ ఉలిక్కిపడి చూసింది. నన్ను చూసి బెదిరిపోతూ లేవబోయింది. పూర్ణ నన్ను చూసి ఎందుకింత భయపడిపోతుందో అర్థంకాలేదు. బహుశ నేను అందంగా లేనని అసహ్యించుకుంటోందా? ఆ ఆలోచన నాకు ముల్లులా గుచ్చుకుంది.

"పూర్ణా ! నేనందంగా లేనని అసహ్యమా?"

కాదు అన్నట్టు తలూపింది.

"మరెందుకలా వెళ్ళిపోతున్నావ్? కాస్సేపు నాతో మాట్లాడవచ్చుగా?" అనడిగాను.

దానికీ సమధానం చెప్పలేదు. నాకు కోపం వచ్చింది. నేనంటే ఇష్టంలేని ఈ అమ్మాయితో మాట్లాడేదేమిటి? అనుకుంటూ విసురుగా ఇంటికి వచ్చేశాను.

మర్నాడు అమ్మ అంది - " ఏరా నిన్న పూర్ణపైన కోపం తెచ్చుకున్నావుటగా ?

"అవునమ్మా ! చెప్పరాని కోపం వచ్చింది. ఎన్ని ప్రశ్నలు వేసినా ఒక్కదానికీ .జవాబు చెప్పలేదు."

"పూర్ణ మూగపిల్లరా!"

"నేను ఉలిక్కిపడ్డాను. కోపం మంచులా విడిపోయింది. దాని స్థానంలో జాలి కలిగింది.

"కానీ చిత్రం చూశావురా? పూర్ణకి చెవుడు లేదు. అందమైన పిల్లకి ఆ అవకరం ఏమిటో !" అమ్మ కూడా జాలిపడింది.

పూర్ణ రూపం నా కళ్లముందు మెదిలింది. కాలవ ఒడ్డున చెంపకు చెయ్యి చేర్చుకుని దిగంతాలలో అస్తమిస్తున్న సూర్యుణ్ణి చూస్తూ కూర్చున్న పూర్ణ రూపం నా మనసులో స్థిరంగా ఉండిపోయింది.

ఆ రూపాన్ని కాన్వాస్ మీదికి ఎక్కించేవరకూ నిద్రపట్టలేదు నాకు.

మర్నాడు ఆ చిత్రాన్ని పూర్ణకు చూపించాను. ముత్యాల వాన కురిసినట్లు, జాజులు జాలువారినట్లు నవ్వింది.

నేను ఆమె వేపు పరవశంగా చూశాను. కొద్ది రోజుల్లోనే పూర్ణా,నేనూ సన్నిహితులమయ్యాం. పూర్ణ చిత్రాలు ఎన్నో గీశాను. ఇద్దరం ఎన్నో కబుర్లు చెప్పుకునేవాళ్ళం. పూర్ణ మాట్లాడకపోయినా ఆమె కళ్ళు ఎన్నో కబుర్లు చెప్పేవి. ఆమె నవ్వులో ఎన్నో అర్థాలు ద్యోతకమయ్యేవి.

కాలేజీకి వచ్చినా పూర్ణ గుర్తుకొచ్చేది. పూర్ణకు ఎన్నో ఉత్తరాలు రాసేవాడిని.

ఒకసారి అమ్మ పూర్ణకు సంబంధాలు చూస్తున్నారని ఉత్తరం రాసింది. కానీ మూగతనం అడ్డొస్తోందని కూడా రాసింది.

పూర్ణకు ఇప్పుడిప్పుడే పెళ్ళి కుదర కూడదు..అని మొక్కుకునే వాణ్ణి.

ఎప్పుడెప్పుడు శెలవులు వస్తాయా? పూర్ణని చూస్తానా అని ఆరాటపడేవాణ్ణి. ఒకప్పుడు నా ఊరొక్కటే నాకున్న ఆకర్షణ. ఇప్పుడు పూర్ణకూడా...

మరో ఆరు నెలలు గడిచాయి.

ఈ మధ్యకాలంలో ఎన్నో చిత్రాలు గీశాను. ఒక విధంగా చెప్పాలంటే నా చిత్రాలకు ఊపిరి పూర్ణే. అప్పుడప్పుడు పూర్ణ తన మూగభాషలోనే నా చిత్రాలలోని లోపాల్ని నిర్మొహమాటంగా చెప్పేది. పూర్ణ నాలోని చిత్రకారుడికి మెరుగులు దిద్దింది. పూర్ణ నాజీవిత భాగస్వామిని అయితే నాలోని చిత్రకారుడు ఇంకా ఇంకా అభివృద్ధిచెందుతాడు. సౌందర్యవతి అయిన పూర్ణ నాభార్య అయితే నా చిత్రాలు కూడా అందంగా ఉంటాయి. మూగ పిల్ల అయితే ఏం ? మాటల కందనివి ఆమె మౌనంలో స్ఫురిస్తాయి.

పూర్ణకు కూడా నేనంటే చాలా ఇష్టం. నన్ను చూడగానే మెరిసే ఆ కళ్ళు సిగ్గుతో ఎర్రబడే బుగ్గలు ఆమాట నిజమని చెప్పేవి. ఈసారి వేసవి శెలవులకు వెళ్ళినప్పుడు అమ్మతో చెప్పాలి అనుకున్నాను. అలాగే చెప్పాను కూడా!

అమ్మ ఈ విషయం వినగానే ఎగిరి గంతేస్తుందనుకున్నాను. పూర్ణంటే అమ్మకు చాలా ఇష్టమని నాకు తెలుసు. కానీ అమ్మ మౌనంగా ఉండిపోయింది.

అమ్మ తీరు నాకాశ్చర్యం కలిగించింది. అమ్మకాదన్నా పూర్ణని చేసుకోవాలని మనసులో నిర్ణయం కూడా చేసుకున్నాను.

"అమ్మా ! నేను పూర్ణను చేసుకుని తీరుతాను ! ఎవరు కాదన్నా సరే" అంటూ విసురుగా వెళ్ళిపోయాను.

మర్నాడుదయం పూర్ణ నవ్వు వంటింట్లో వినిపించింది. నా శరీరం ఆనందంతో జల్లుమంది. పూర్ణకు నేను వచ్చినట్టు తెలుస్తుంది. వెంటనే నా గదిలోకి పరుగెట్టుకు వస్తుంది. నవ్వుల పూల జల్లుతో నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. - ఆ క్షణాల కోసం ఎదురుచూస్తున్నాను.

కొన్ని క్షణాలు గడిచాయి

నాగది ముందు మువ్వల శబ్దం వినబడింది. క్రమక్రమంగా దూరమైపోయింది.

బహుశా నేను వచ్చినట్లు అమ్మ చెప్పలేదేమో? అనుకుని మరో అరగంటలో తయారయి పూర్ణ ఇంటికే వెళ్లాను. పూర్ణ వరండాలో కూర్చుని ఎవరితోనో తన భాషలో మాట్లాడుతోంది.

"పూర్ణా!" మెల్లగా పిలిచాను.

పూర్ణ వెనుదిరిగి చూసింది.

అంతే! షాక్ కొట్టినట్లయింది. తూలి పడబోయి అతి కష్టం మీద నిలదొక్కుకున్నాను.

ఏమిటిది? పూర్ణ ఇలా అయిపోయింది? ఏం జరిగింది? ఇంటికెలా వచ్చానో నాకే తెలీదు.

నాకళ్ళముందు నల్లగా పెద్దపెద్ద మచ్చలతో వికృతంగా ఉన్న పూర్ణముఖమే మెదలసాగింది.

పూర్ణకేం జబ్బుచేసింది.! ఆమె అందమంతా ఎలా మాయమైపోయింది? అమ్మనడిగాను.!

"బాబూ ! రెండు నెలల క్రితం పూర్ణకు పెద్ద జబ్బు చేసిందిరా ! ఈ పల్లెటూళ్ళో సరైన వైద్యం లేక చచ్చి బ్రతికిందిరా!

అమ్మ పూర్ణమీద జాలిపడుతూ ఏవేవో చెప్తోంది. "పూర్ణ మనస్సు వెన్నరా! ఆ పిల్లకు అందం లేకపోతే ఏం? నీకు తగిన భార్యరా! పూర్ణకు నువ్వంటే ప్రాణంరా! అటువంటి పిల్లను చేసుకుంటే సుఖపడతావు. అందం కొరుక్కుతింటామా."

"పూర్ణ ఒకప్పుడు పుత్తడి బొమ్మ పూర్ణమ్మే!

కానీ ఇప్పుడు అందమంతా పోయి వికృతంగా తయారయింది.

వికార రూపంలో ఉన్న పూర్ణని నేనెలా చేసుకోగలను? ఇక అక్కడ ఉండలేక ఆరాత్రే బయలుదేరా వచ్చేశాను. మళ్ళీ ఎన్నడూ ఆ పల్లెటూరికి వెళ్ళలేదు. డిగ్రీ అవగానే ఉద్యోగం రావడంతో ఆ గతాన్ని పూర్తిగా మరచిపోయాను."

చైతన్య ఆగాడు.

పూర్ణ కథ చైతన్య ఇదివరకోసారి చెప్పాడు. ఆ రోజు చైతన్య చెప్పగానే పూర్ణని

తలచుకుని బాధపడ్డాను

మళ్ళీ కొత్తగా ఈ రోజు ఎందుకు చెప్పున్నాడో అర్ధం కాలేదు..

"చైతన్యా నీహారికకు పూర్ణ విషయం తెలుసా?" అనడిగాను

"ఆ ! నేనే చెప్పాను."

"నీహారిక ఏమంది?" ఆత్రంగా అడిగాను నా దృష్టిలో నీహారిక అద్భుతమైనస్త్రీ ఆమె ఆలోచనలు, అభిప్రాయాలు ఎంతో తార్కికంగా, మరెంతో ఉన్నతంగా ఉంటాయి ఆమెతో మాట్లాడటమే గొప్ప ఎడ్యుకేషన్ ఆమె మాటలు విన్నాక నేనెన్నో విషయాలపై నా అభిప్రాయాలను మార్చుకున్నాను. ఏదైనా కొత్త విషయం తెలిస్తే నీహారిక దీన్ని గురించి ఏమనేదో? అనిపించేది. పూర్ణ గురించి విన్నాక నీహారిక ఏమందో తెలుసు కోవాలనిపించింది.

కానీ చైతన్య సమాధానం చెప్పలేదు

"పూర్ణ ఇప్పుడెక్కడుంది?"

'ఈ లోకంలో లేదు." నిర్లిప్తంగా చెప్పాడు.

నేను నిరుత్తుడయ్యాను.

'నువ్వు పూర్ణని చేసుకునుంటే బాగుండేదిరా" అన్నాను.

అమాటకు కోపం వచ్చింది చైతన్యకి."గోపాలం నేను సౌందార్యారాధకుణ్ణి! అంతే కాదు చిత్రకారుణ్ణి. అనాకారిని ఎలా చేసుకుంటాను.?"

వాడి మాటలూ నిజమే అనిపించింది.

"సరే నీహారిక విషయం చెప్పు."

"ఆ విషయానికి ఉపోద్ఘాతమిది. నీహారికను పెళ్ళి చూపుల్లో చూసి అప్రతిభుడినయిపోయాను. నీహారిక సాంగత్యంలో గతాన్ని తొందరగానే మరిచిపోయాను.

నీహారిక అందాన్ని అభిమానించాను, ఆరాధించాను.

ఆమె అందాన్ని ఆధారంగా తీసుకుని ఎన్నో చిత్రాలు గీశాను.

"ఆమె కూడా నన్ను ప్రేమిస్తుందని భ్రమించాను. ఆరునెలల క్రితం ...నేను ఒక మధ్యాహ్నం తల నొప్పిగా ఉండి సెలవు పెట్టి ఇంటికి వచ్చాను.

"వీధి తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. తలుపు నెట్టబోతుండగా లోపలినుండి బిగ్గరగా నవ్వులు వినిపించాయి. పక్కనున్న కిటికీలో నుండి చూశాను. నీహారిక ఆమెకెదురుగా ఎవరో యువకుడు. అతడేదో అంటున్నాడు. నీహారిక పడీపడీ నవ్వుతోంది.

ఆ దృశ్యం నా తలనొప్పిని మరింత ఎక్కువ చేసింది. గబుక్కున తలుపు తోసుకుని లోపలకు అడుగుపెట్టాను.

నీహారిక లేచి నిలబడింది.

"అదేమిటీ అప్పుడే వచ్చేశారు?" అంటూ అతడిని నాకు పరిచయం చేయబోయింది.

నేను వినిపించుకోకుండా లోపలకు వెళ్ళాను మళ్ళీ మరో నెలకి మరో దృశ్యం మంచంమీద కూర్చొని ఉన్నారు నా చిత్రాలు అతనికి చూపిస్తోంది నీహారిక. అతడేదో అంటున్నాడు. నీహారిక నవ్వుతోంది జారిపోయిన పమిటను కూడా గమనించకుండా."

చైతన్య ఆవేశపడసాగాడు.

"ఈ చిన్న విషయానికే ..." నేనేదో అనబోయాను.

"గోపాలం ! ఇది చిన్నవిషయమా? నా భార్య పరాయి వ్యక్తితో కులుకుతుంటే చూస్తూ సహించేటంత విశాల హృదయం నాకు లేదు. ఇటువంటి విషయాలు అనుభవించే వ్యక్తికే దాంట్లోని బాధ తెలుస్తుంది?"

నేను మాట్లాడలేదు.

"నీహారిక అందం గొప్పది. కానీ ఆమె మనస్సు వికృతమైంది. అటువంటి స్త్రీతో నేను సంసారం చెయ్యలేను. అందుకే పుట్టింటికి పంపేశాను...." ఎటో చూస్తూ అన్నాడు.

నాకేం చెప్పాలో, ఎలా ఓదార్చాలో తెలీలేదు.

ఆ రాత్రికి ఇద్దరం కలిసి భోజనం చేస్తూండగా అన్నాను.

"చైతన్యా! నువ్వు మామూలు మనిసివి కాదు..... కళాకారుడివి. ఇటువంటి విషయాల్ని నువ్వంతగా పట్టించుకోకూడదు. చిత్రాలే నీ సహచరులు. చిత్రలేఖనంలోఉన్నత శిఖరాల్ని అధిరోహంచడమే నీ లక్ష్యం. నీ మనస్సునంతా ఆ కళపైన కేంద్రీకరించు..... అంతర్జాతీయంగా పేరు పొందు. రాగద్వేషాలకు అతీతుడివిగా ఉండు!"

చైతన్య బుద్ధిగా విన్నాడు.

"రేపుండకూడదూ?" చైతన్య అన్నాడు.

"లేదురా! అర్జంటుగా వెళ్ళాలి!"

"నేనూ స్టేషన్‌కు వస్తాను."

చైతన్యభోజనం ముగించి బట్టలు వేసుకోబోతుండగా అతని కోసం ఎవరో వచ్చారు.

చైతన్య ఇబ్బందిగా ముఖం పెట్టాడు. వాడికి సర్ది చెప్పాను. "ఫర్వాలేదురా.. నేనేం కొత్తవాడినా? నువ్వు వాళ్ళతో మాట్లాడు, నేను వెళ్ళొస్తాను."

టాక్సీలో స్టేషన్‌కి వచ్చాను.

రైలు గంట లేటు.

టిక్కెట్టు తీసుకుని ఫ్లాట్‌ఫారమ్ మీదనున్న కుర్చీలో కూర్చున్నాను.

రైల్వే ఫ్లాట్‌ఫారమ్ మీదనున్న కుర్చీలో కూర్చుని వచ్చే పోయే జనాన్ని పరిశీలించడం అలవాటు.

ఈ రోజుకూడా అటువంటి పరిశీలనలో మునిగి ఉండగా

"గోపాలంగారూ!" అన్న పిలుపు విని తప పక్కకు తిప్పి చూశాను.

నీహారిక ! నవ్వుతూ నిలబడి వుంది. నాకళ్లను నేనే నమ్మలేకపోయాను.

"నీహారికా...మీరేనా?"

"అవునండీ ! నేనే ..... ఏమిటిలా వచ్చారు?"

"ఆఫీసు పని మీద...." తడబడిపోయాను.

నీహారిక పకపకా నవ్వింది. "మీకు అబద్దాలాడటం కూడా రాదు. ఎందుకంత కష్టపడతారుగానీ నిజం చెప్పండి. చైతన్య ఉత్తరం రాస్తే వచ్చారు కదూ?" నా పక్కనున్న కుర్చీలో కూర్చుంటూ అంది.

ఇప్పుడు కాదు.........నీహారికను ఎప్పుడు కలిసినా ఇటువంటి షాక్‌లు నాకిస్తూనే ఉంటుంది. నీహారికను అర్థం చేసుకోవడం.......... ఆమె ఆలోచనాస్థాయికి ఎదగడం...... చైతన్యకు సాధ్యం కాదేమోననిపిస్తుంటుంది నాకు.

"చైతన్య జాలికథ వినిపిస్తే .మీరు బోలెడంత సానుభూతి చూపించివచ్చారా."

నేను మాట్లాడలేదు. నీహారికతో మాట్లాడటం నాకు సాధ్యం కాదని నా కెప్పుడో తెలుసు.

నీహారిక విషయంలో నేనెప్పుడూ శ్రోతనే..

"గోపాలంగారూ! చైతన్యకున్న స్నేహితులందరిలో మీరంటే నాకు ప్రత్యేకమైన గౌరవం. నాణేనికి ఒక ప్రక్కన చూస్తేనే చాలదు. నేను చెప్పేది కూడా వినండి."

"చెప్పండి."

"మీ స్నేహితుడు గొప్ప కళాకారుడే.. కానీ అంతకు మించిన గొప్ప శాడిస్ట్." అంది.

నేను ఉలిక్కిపడ్డాను.

"అవును అది పైకి కనపడదు. భార్యకి మాత్రమే తెలిసే గుణం అది. పూర్ణ ఆత్మహత్య చేసుకోడానికి కారణం ఎవరో తెలుసా? చైతన్య... ఒక విధంగా చెప్పాలంటే అతడే ఆమెను హత్య చేశాడు."

"హత్యా?"

"ఇటువంటి హత్యలు ఎవరికీ తెలియవు. పూర్ణ గర్భవతి. చైతన్య తిరస్కారం ఆమె చావుకు కారణం."

నాకు నోట మాట రాలేదు.

"నాకీ విషయం తెలిసినా అతణ్ణి క్షమించాను. ప్రేమించాను.అతను నన్నూ హింసించడం మొదలెట్టాడు. ఎలాగో తెలుసా? అతని చిత్రాలకు, అతనికిమాత్రమే నేను పరిమితం. బయటకు అడుగు పెట్టకూడదు. అతని చిత్రాల్లో నన్ను చూసి నాతో మాట్లాడాలని వచ్చేవారు. వాళ్లను అవమానించి పంపేవాడు. అతడు వేసే చిత్రాలకు మోడల్‌గా ఉండటానికి అంగీకరించలేదని ఒకసారి నాకు సిగరెట్‌తో వాతలు పెట్టాడు. అతడు నన్ను పుట్టింటికి పంపెయ్యడానికి కారణం తెలుసా ? అతని నగ్న చిత్రాలకు నేను మోడల్‌గా ఉండనని చెప్పానని."

నేను తెల్లబోయి వింటున్నాను. చైతన్యతో ఇన్నాళ్ళ పరిచయం ఉందికానీ....... నాణేనికి రెండోవైపు నేనింతవరకూ చూడలేదు.

"అతను అందంగా ఉండడు. అది అతనిలోని ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుకు కారణం. అతనిలోని కళ ఆ కాంప్లెక్సును జయించలేకపోయింది. భార్య అన్నివిధాలా తనకన్నా ఉన్నతురాలైతే సహించలేడు. ఆమెలో ఏదో లోపం ఉండాలి. పూర్ణ మూగది అవడంతో తన్నెక్కువ ఆకర్షించింది. నాలో ఏలోపం లేకపోవడంతో సహించలేక కుమార్‌కీ నాకూ అక్రమ సంబంధాన్ని అంటగట్టాడు...."

"నీరూ!" అంటూ ఒక యువకుడు చేతినిండా పళ్ళు, పుస్తకాలతో వచ్చాడు.

నీహారిక పరిచయం చేసింది.

కుమార్...చాలా అందంగా ఉన్నాడు. "అతడు అంటగట్టిన సంబంధాన్ని నిజం చేశాం. మేమిద్దరం ఈ ఉదయమే పెళ్ళి చేసుకున్నాం. హనీమూన్‌కి ఊటీ వెళుతున్నాం...." నవ్వింది నీహారిక.

వాళ్ళిద్దరి జంటా కన్నుల పంటగా ఉంది.

"వెళ్ళొస్తానండీ! మీ చైతన్య గొప్ప నటుడు. లోకుల దృష్టిలో సౌందర్యారాధకుడుగా కనిపించడం కోసం అందమైన భార్య కావాలి. ఆ అందాన్ని అభిమానించడం తెలీదు. రేకులు చిదిమి...సువాసనను ఆఘ్రాణించడమే తెలుసు. ఈ గుణం పోనంతవరకూ అతడు గొప్ప కళాకారుడిగా రాణించలేడు. నామాటగా చెప్పండి."

హేండ్ బాగ్ పట్టుకుని లేచి నిలబడింది. కుమార్ నీహారిక భుజం చుట్టూ చెయ్యివేసి ఆమెను నడిపిస్తున్నాడు.

బంగారానికి సువాసన తోడయినట్లుంది. నీహారిక కుమార్‌ను వరించడం.... ఆమె అదృష్టం..........అనుకున్నాను.

ఆ తర్వాత నా ఆలోచనలు చైతన్య వేపు మళ్ళాయి.నీహారిక మాటల్ని బట్టి చూస్తుంటే చైతన్య చాలా కొత్తవాడిలా కనిపిస్తున్నాడు.

చైతన్య మాటల్లోనూ ప్రవర్తనలోనూ నాకెన్నడూ వైవిధ్యం కనబడలేదు. కానీ నీహారిక అసాధారణ యువతి! ఆమె అంటే నాకెంతో గౌరవం.

నీహారికను చూస్తుంటే మంచు పుష్పాలు ధరించిన దేవతా స్త్రీలు గుర్తుకొస్తారు.నీహారిక మాటల్ని నేను పూర్తిగా నమ్మాను.

నీహారిక నిష్క్రమణం చైతన్యను మారుస్తుంది. నేను అతనితో అన్నట్లుగా చైతన్య పెళ్ళి, సంసారం వదిలేసి రాగద్వేషాలకు అతీతుడై తన మనస్సుని కళపైన కేంద్రీకరిస్తాడు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన చిత్రకారుడవుతాడు అనుకున్నాను.

ఇంతలో నా రైలు వచ్చింది.

విజయవాడ వచ్చిన మర్నాడు చైతన్యకి నీహారిక కనబడటం ఆమె మాటలు గురించి రాస్తూ ఆరోజు చైతన్యతో నేనన్న మాటల్ని మరొకసారి గుర్తుచేశాను.

"చైతన్యా! నువ్వొక గొప్పచిత్రాన్ని గీసి నాకు రాయి. చూడటానికి వస్తాను" అని చివరగా రాశాను.

* * *

మరో ఆరు నెలలు గడిచాయి. చైతన్య దగ్గరనుండి వచ్చే ఉత్తరం కోసం ప్రతి రోజూ ఎదురు చూస్తూనే ఉన్నాను. చివరికి ఒక రోజు అతని దగ్గరనుండి ఒక గులాబీ రంగు కవరొచ్చింది.

ఆత్రంగా విప్పాను.

దానిలో ఇలా ఉంది.

"గోపాలం,

వచ్చే బుధవారం నాపెళ్ళి. నా భార్య లావణ్య. పేరుకు తగ్గ లావణ్యవతి. ఆమె అందాన్ని చిత్రాల్లో బంధించి శాశ్వత కీర్తిని సంపాదిస్తాను." నువ్వు పెళ్ళికి తప్పక రావాలి సుమా !"

చైతన్య.

ఆ ఉత్తరం చదివిన నాకు నీహారిక మాటలు గుర్తుకొచ్చాయి. చిన్నగా నిట్టూర్చాను.

ఎదురుగా గోడమీద చైతన్య చిత్రం నన్ను వెక్కిరించినట్లయింది.

చైతన్య సౌందర్యారాధకుడు కాడు. ఒట్టి కాముకుడు. మరోసారి అతని జాలి కథ వినడానికి మాత్రం నేను వెళ్ళదల్చుకోలేదు.!